క్లుప్తంగా

'గాదె' విజయంపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

దత్తిరాజేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంపై మండల పీఆర్టీయూ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన, పీఆర్టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.జగదీశ్వరరావు, జిల్లా వైస్ ప్రెసి డెంట్ పరుశరాం, మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి శంకరరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, ప్రభుత్వ విద్యా వ్యవస్థబలోపేతానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. మళ్లీ ఉపాధ్యాయులు ఆయనపై నమ్మకం ఉంచి అంతా ఏక తాటిపై నడిచారని అన్నారు.

గాలిలో పదవుల్లోకి వచ్చేది టీడీపీ నాయకులే


బెల్లాన త్రినాథరావు

చీపురుపల్లి: గాలిలో అధికారంలోకి రావడం, గాలిలో పదవులు పొంది కుర్చీల్లో కూర్చోవడం టీడీపీ సాంప్రదాయమేనని వైఎస్సార్‌సీపీ వలంటీర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు అన్నారు. సోమవారం శాసనమండలిలో విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు గాలికి వచ్చారంటూ వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఎవరు గాలిలో పదవులు పొందుతున్నారో, ఎవరు ప్రజల మధ్యన ఉంటూ ప్రజాశీస్సులతో పదవులు తెచ్చుకుంటున్నారో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలుసునని చెప్పారు. బొత్స సత్యనారాయణ 1999లో ఎంపీ, 2004, 2009, 2019లో ఎమ్మెల్యే, మంత్రిగా కొనసాగారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేశారన్నారు. బొత్సను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

ఏఐపై సెమినార్


ట్రైనర్ విజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద కళాశాలలో ఐసీటీ అకాడమీ సౌజన్యంతో డిగ్రీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)పై సోమవారం సెమినార్ నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రైనర్ ఏ.విజయ్‌కుమార్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏఐ ప్రాధాన్యత, భవిష్యత్‌లో ఏఐ పాత్ర, కంప్యూటర్స్ విభాగంలో ఏఐ అవసరం వంటి అంశాలను వివరించారు. కళాశాల కరస్పాం డెంట్ సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, పీఓ సీహెచ్.మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రాములమ్మ

వేపాడ: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ జె.రాములమ్మ కోరారు. భూరీసర్వేపై మం డలంలోని ఆతవ గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడు తూ రైతులు తమ భూముల డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామ సర్పంచ్ వేమననాయుడు, డీటీ సన్యాసినాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాల సందర్శన


విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు సోమవా రం సందర్శించారు. పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్ పరీక్షించి, వారితో పాఠ్యాంశాలు చదివిం చారు. విద్యార్థుల దస్తూరి మెరుగుపరచడంపై దృష్టిపెట్టాలని, అందుకు తగిన విధంగా హోంవర్క్ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజ న వంటలను పరిశీలించి, పథకం నిర్వాహకులతో మాట్లాడారు. రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని చెప్పారు.

ఆదాయం ఉన్నా... సౌకర్యాలు సున్నా

- అభివృద్ధికి నోచుకోని పుణ్యగిరి దేవస్థానం
- ఏటా పెరుగుతున్న ఆదాయం
- అయినా వసతులు శూన్యం
- శాశ్వత మరుగుదొడ్లు, ఇతర నిర్మాణాలు లేని వైనం
- రాజకీయ చట్రంలో బోర్డులు
- అవస్థలు పడుతున్న భక్తులు


అభివృద్ధికి నోచుకోని పుణ్యగిరి క్షేత్రం


పుణ్యగిరి ఆలయ మార్గంలో స్త్రీల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరికి మాత్రం పుణ్యం దక్కడం లేదు. తరాలు మారినా ఇక్కడి ఉమాకోటిలింగేశ్వర స్వామి భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ప్రకృతి ఒడిలో ఉన్న ఇక్కడి ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయం కచ్చితంగా ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులకు, భక్తులకు నచ్చే దివ్యధామం. ఈ క్షేత్రాన్ని, ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల న్న లక్ష్యసిద్ధి పాలకుల్లో లేకపోవడంతో పుణ్యగిరి కునారిల్లుతోంది.

ఏటా పెరుగుతున్న ఆదాయం

భక్తులకు వసతులు, సౌకర్యాలు లేకున్నా, పట్టించుకునే నాథులు కరువైనప్పటికీ పుణ్యగిరికి మాత్రం ఏటా ఆదాయం పెరుగుతు నే ఉంది.ఆదాయం ఉన్నా భక్తులకు అవసరమైన తాగునీరు, వాడుక నీరు, మరుగుదొడ్లు విశ్రాంత గదులు, మెట్లమార్గంలో షెల్టర్లు, కేశఖండన శాల వం టి కనీస సౌకర్యాలు కల్పించాలన్న ఆలోచన ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధుల్లో లేకపోవడం బాధాకరం. 2023 శివ రాత్రి జాతరకు రూ.13,69,086, 2024లో రూ.14,85,419 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.15,08,069 ఆదాయం వచ్చింది.

కాకి లెక్కలతో ఖజానా ఖాళీ

శాశ్వతంగా తాగునీరు, వాడుకనీరుకు పైప్‌లైన్లు వేస్తే చలివేంద్రాల ఏర్పాటు ఖర్చు తగ్గుతుంది. టాయిలెట్ల నిర్మాణం చేపడితే తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ఒక్కో ఏడాది ఒక్కో ప్రాంతంలో బారికేడ్లు నిర్మాణం చేస్తే ప్రతి ఏటా కొయ్యలు, మేకులు, దడుల నిర్మాణం పేరుతో చేసే వేల ఖర్చుకు కళ్లెం వేయవచ్చు. మెట్ల మార్గంలో మర మ్మతుల పేరిట ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తున్నారు.

పర్యావరణం..పరిశుభ్రత దయనీయం

పుణ్యగిరిలో పర్యావరణం, పరిశుభ్రత దయనీయంగా ఉంది. పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలపై నియంత్రణ లేక కొండ అంతా చెత్త నిండు తోంది. భక్తులు, పర్యాటకులు తెస్తున్న పాలిథిన్ సంచులు, పారబోస్తున్న చెత్తతో పచ్చనైన కొండపై పర్యావరణం మంట గలుస్తోంది. నిత్యం వందలాది మంది వంట చెరకు వ్యాపారం కోసం కొండపై చెట్లు కొట్టేస్తుండడంతో కొండపై పచ్చదనం మాయమౌతోంది. రహదారుల పక్క ఎవెన్యూ ప్లాంటేషన్ చేస్తున్నా, పుణ్యగిరి మెట్ల మార్గం పక్కన మొక్కలు నాటాలన్న ఆలోచన ఫారెస్టు, దేవదాయ శాఖలు చేయకపోవడంతో జాతర వేళ మెట్ల మార్గంలో భక్తులు మండే ఎండల్లో అవస్థ పడుతున్నారు.

టూరిజం హబ్‌గా మారిస్తే మరింత ఆదాయం

ఏటా శివరాత్రి వేళ పుణ్యగిరి జాతరకు చుట్టు పక్క జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. కార్తికమాసంలో నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. విశాఖ- అరుకు రహదారిలో ఉన్న పుణ్యగిరిని టూరిజం హబ్‌గా మారిస్తే ఆలయానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆలయ ట్రస్ట్ బోర్డులు రాజకీయ చట్రంలోనే ఉంటున్నాయి తప్ప దేవస్థాన అభివృద్ధికి ఏనాడూ పనిచేయలేదు. పుణ్యగిరిని ప్రముఖ పర్యాటక క్షేత్రంగా, టూరిజం హబ్‌గా మార్చేస్తానంటూ గతంలో, 2024 ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఊదరగొట్టారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. ప్రస్తుతం ఏపీ టూరిజం డైరెక్టర్‌గా ఉన్న మండల వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి, మూడవ ధపా ఎమ్మెల్యే అయిన కోళ్ల లలితకుమారి కూడా పుణ్యగిరి వైపు కన్నెత్తి చూడలేదు.

ప్రతిపాదనలు చేశాం

పుణ్యగిరి కొండపై శాశ్వత మరుగుదొడ్లు, మెట్ల మార్గంలో మంచి నీటి ట్యాంక్‌లు, విశ్రాంతి షెల్టర్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వాటిని ఎమ్మెల్యే ద్వారా ఏపీ టూరిజం బోర్డుకు పంపించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

–కె.నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పుణ్యగిరి దేవస్థానం, ఎస్.కోట.

ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనం


వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: టీడీపీ కూటమి ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో వ్యతిరేకత పెరుగుతోందని చెప్పడానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ ఎన్నికల ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనా యుడు అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యా య ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయంపై హర్షం వ్యక్తం చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజకీయాలతో సంబంధం లేని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సైతం కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులిమిందన్నారు.ఈ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించి సాధారణ కార్యకర్తల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఆ పార్టీల నాయకులు పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేసి, ఉపాధ్యాయులపై ఒత్తిడి చేశారని గుర్తు చేశారు.ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల ముందు టీడీపీ ,జనసేన నాయకులు టెంట్లు వేసుకుని కూర్చుని ఉపాధ్యాయులను ప్రభావి తం చేసే ప్రయత్నం చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల్లో కూటమి ప్రభుత్వంపై ఏస్థాయిలో వ్యతిరేకత ఉందో ఈ ఫలితాలు చూస్తుంటే అర్థమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులే కాకుండా సాధారణ ప్రజల్లో కూడా తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోండి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో చింతలపాలెం గ్రామస్తుల ఫిర్యాదు


తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులకుఫిర్యాద చేస్తున్న పల్లా భీష్మ,బోను కృష్ణ , తదితరులు

కొత్తవలస:

మండలంలోని చింతలపాలెం రెవెన్యూ పరిధిలో గల 102, 103, 111 తదితర సర్వేనంబర్లలో ఉన్న కొండ, గెడ్డ పోరంబోకు భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని, జిరాయితీ భూములుగా మార్చేందుకు అధికార పార్టీ నాయకులు చేస్తున్న యత్నాలకు అడ్డుకట్టవేయాలని మాజీ సర్పంచ్ పల్లా భీష్మ, బీఎస్పీ నాయకుడు బోను కృష్ణ అధికారులను కోరారు. కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాకెన సన్యాసిపాత్రుడు గతంలో కబ్జాచేసిన ప్రభుత్వ భూమిని జిరాయితీ భూములుగా తన పేరున 119 ఖాతానంబర్‌తో ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్నారన్నారు. దీనిపై గ్రామస్తుల అభ్యంతరంతో ఆ భూములను రెవెన్యూ అధికారులు హోల్డ్‌లో పెట్టారన్నారు. సన్యాసిపాత్రుడు మరణంతో కుటుంబసభ్యులైన ఎస్.తారకేశ్వరి, పిల్లా భాస్వంతియతిరాజేశ్వరి, పిల్లా నాగేశ్వరసాయిరవి, సన్యాసయ్యపాత్రుడు, పిల్లా సీతారాం పాత్రుడు, పిల్లా ఉమానాథ్ పాత్రుడు పేర్లపై ఆ భూములను బదలాయించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు విన్నవించినవారిలో గ్రామానికి చెందిన పలువురు పెద్దలు ఉన్నారు.

ఫిట్‌నెస్ పత్రాల జారీ బాధ్యత నుంచి తప్పించాలి..


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వేదాంత మల్టీనేషనల్ కంపెనీని ఫిట్‌నెస్ పత్రాల జారీ బాధ్యతల నుంచి తప్పించాలని ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 10న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సోమవారం స్థానిక ఎన్‌పీఆర్ శ్రామిక భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఆర్టీఓ ఆఫీస్‌లో వెహికల్ ఫిట్‌నెస్, పొల్యూషన్, రెన్యువల్, రిజిస్ట్రేషన్ వంటి సేవలు అందేవన్నారు. అయితే తాజాగా వేదాంత అనే మల్టీనేషనల్ కంపెనీకి ఫిట్‌నెస్ బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల మోటార్ కార్మికులు, వాహన యజమానులకు తీరని నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చలాన్‌ల పేరిట వేధించడం తగదన్నారు. ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్మోహన్, బి.రమణ, ఆటో యూనియన్ నాయకులు పాపారావు, రామునాయుడు, ఉమామహేశ్వరరావు, పైడిరాజు, లక్ష్మణరావు, సత్యనారాయణ, రమణ, శ్రీను, కిశోర్, చంద్రశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను ఊరేగింపు

బొండపల్లి: ఎల్లమ్మ తల్లి పండగ సందర్భంగా మండల కేంద్రంలో ఈనెల 6వతేదీన సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. పూజారి బొట్టా సత్యం ఆధ్వర్యంలో సోమవారం సిరిమానును సిద్ధం చేసి గ్రామంలో మేళతాళాల మధ్య ఊరేగించారు. గురువారం సాయం త్రం నిర్వహించే సిరిమానోత్సవానికి గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

గరుడుబిల్లికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

బొండపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో గరుడుబిల్లి గ్రామానికి మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి కొత్త ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేయించి, సోమవారం సరఫరా పునరుద్ధరించారు.

నేడు అభయాంజనేయస్వామి తీర్థం

వేపాడ: పాటూరు గ్రామంలో గాడివారి కల్లాల వద్ద అభయాంజనేయస్వామి తీర్థమహోత్సవం మంగళవారం నిర్వ హించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యా హ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందచేయనున్నామని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

అన్న సమారాధన

దత్తిరాజేరు: స్థానిక శివాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమ వారం అన్న సమారాధన నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి తర్వాత వచ్చే సోమవారం నాడు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంద ని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. స్థానికులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన 2వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు

భూఆధార్ నమోదు పరిశీలన


భూఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: పెదకాద గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం చేపట్టిన భూఆధార్ నమోదు కార్యక్ర మాన్ని ఏఓ అనురాధ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూఆధార్ కోసం రైతులు ఈనెల 10వ తేదీలో గా తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని సూచించారు. భూఆధార్ ఉన్న రైతులకే పీఎం కిసాన్ పెట్టుబడి సాయం,పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పోషకాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణా లపై వడ్డీ రాయితీ, వ్యవసాయ సంబంధిత పథకాలు, ప్రోత్సాహకాలు అందుతాయని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కెంగువ గ్రామంలో ఉమాకేదారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామపెద్దల ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్న అదే గ్రామానికి చెందిన కుప్పిలి శ్రీను దంపతులుతో వేదపండితులు పూజలు చేయించారు.

– గజపతినగరం రూరల్

వన్యప్రాణులకు హానిచేస్తే చర్యలు



వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయనగరం డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ డి.సుబ్బారావు హెచ్చ రించారు. ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా దమరసింగి గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణు లు వల్ల రైతులు పండించిన పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని చెప్పారు. కొండలు, అటవీ ప్రాంతాల నుంచి వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చేస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. బీట్ ఆఫీసర్ రామారావు, స్థానిక నాయకుడు మీసాల ప్రసాద్, ఆటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

– గుర్ల

ఎవరైనా వేధిస్తే సమాచారమివ్వండి



ఆకతాయిలు వేధించినా,ఫోన్ చేసి విసిగించినా తక్షణమే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు విద్యార్థినులకు సూచించారు. గజపతినగరం ప్రభుత్వ బాలిక ల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులకు చట్టాలు, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ చట్టాలు, హక్కులు, విధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. రోజురోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

– గజపతినగరం

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ


భవిత కేంద్రాన్ని సందర్శిస్తున్న జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రామారావు

గజపతినగరం: భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలపై ఐఈఆర్టీలు మరింత శ్రద్ధ పెట్టాలని, వారి మానసిక ఎదుగుదలకు దోహద పడాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రామారావు సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో సోమ వారం ఆయన తనిఖీలు చేశారు.రికార్డులు పరిశీలించడంతో పాటు కేంద్రానికి ఎంతమంది పిల్లలు వస్తున్నారని, ఎంతమందికి ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారని ఐఈఆర్టీలు శ్రీనివాసరావు,సత్యనారాయణను ఆరా తీశారు.పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. అక్కడి నుంచి బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లి, అక్కడ జరుగుతున్న ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంఈఓ విమలమ్మ,ఎంఈఓ–2 సాయిచక్రధర్, బాలుర హైస్కూల్ హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, సీఆర్పీలు రామసూరిరెడ్డి, నారాయణరావు, తదితరులు ఉన్నారు.

లైసెన్స్ లేకపోతే రూ.10వేలు జరిమానా


డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

గజపతినగరం: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి వారిపై రూ.10 వేలు జరిమానా విధిస్తున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. స్థానిక జాతీయ రహదారి–26పై సోమవారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ లు నిర్వహించారు. వాహన పత్రాలతో పాటు లైసెన్స్‌లు పరిశీలించారు. పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రక్తదానం


రక్త దాతలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎస్ఐ సుదర్శన్

కొత్తవలస: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్ఐ సుదర్శన్ అన్నారు. మంగళపాలెం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 51 మంది యువకులు రక్తదానం చేశారు. గాజువాకకు చెందిన వందే భారత్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ వినోద్ బాబు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల లోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదాతలకు ఎస్ఐ సుదర్శన్ సర్టిఫికెట్‌లు అందజేశారు

ఆక్రమణలపై ఫిర్యాదు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం, బొండపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న రామలచెరువు, ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని గొట్నంది,శిరుగుడుపేట గ్రామ రైతులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. చెరువు గట్టుపై చెట్లను తొలగించి గట్టును ఆక్రమించేశారని, అలాగే చెరువు మధ్యలో నుంచి రోడ్డు వేయడంతో చెరువు రెండు భాగాలుగా విడిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే చేసి ఆక్రమణలను గుర్తించి, తొలగించాలని కోరారు.

ప్రశాంతంగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు

గజపతినగరం: స్థానిక బాలికోన్నత ,బాలుర ఉన్నత పాఠశాలలు కేంద్రాలుగా సోమవారం నిర్వహించిన ఓపెన్ ఇంటర్ (దూరవిద్య)పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలికోన్నత పాఠశాలలో 185 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 173 మంది హాజరయ్యారన్నారు. అలాగే బాలుర హైస్కూల్‌లో 152 మందికి 121 మంది హాజరయ్యారని చెప్పారు.